E KABURU - Digital News Paper

E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 15-10-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:282 || పేజీలు–6

www.ekaburu.com



**మోసం ఎక్కడుందో ఇట్టే తెలుసుకోవచ్చు** 3



## బొగ్గు గనుల్లో 'కోల్‌మాల్'!

- సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు.. గోదావరిఖని కార్మిక గర్జన సభలో కేటీఆర్ ఫైర్
- అదానీ, అంబానీ వంటి వారి కార్పొరేట్ సంస్థలకు సింగరేణిని అప్పగించేలా రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, మోదీ కలిసి కుట్రలు చేస్తున్నారు
- రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా సంక్షోభంలోకి నెడుతున్నారు
- ఈ కోల్ మాల్ గోల్ మాల్ చేస్తున్న దొంగ ఎవరు?
- సింగరేణి అవినీతిపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్న కేటీఆర్

ఈకబురు,పెద్దపల్లి: సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ, కార్మికుల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాల్లో భాగంగానే తెలంగాణ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. అలాగే త్వరలో సింగరేణి సంస్థను అదానీ, అంబానీ వంటి వారి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేలా రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, మోదీలు కలిసి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

మిగతా 5లో



# ఉద్యోగులుగానే మిగలొద్దు.. సొంత సంస్థలు స్థాపించాలి

- పెద్ద కంపెనీలకు సేవలందించే వారిగానే యువత మిగిలిపోకూడదు
- సరికొత్త వ్యాపార ఆలోచనలతో స్టార్టప్స్‌ను స్థాపించాలి
- స్కైరూట్ వంటి కంపెనీలు 10 రావాలి
- సమాఖ్య బిజినెస్ సమ్మిట్–2026లో సీఎం రేవంత్‌రెడ్డి

**ఈ-కబురు, హైదరాబాద్:** ఎలాన్ మస్క్‌తో హైదరాబాద్ కంపెనీ స్కైరూట్ పోటీ పడుతోందని, మన ఆర్థిక వ్యవస్థ బలపడాలంటే స్కై రూట్ ఏరోస్పేస్ వంటి కంపెనీలు 10 రావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

మిగతా 2లో

## కరెంట్ పోతే ఐఏఎస్‌ల సస్పెన్షన్



- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం
- పంటలకు వచ్చే 20 రోజులు అత్యంత కీలకం
- విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సహించేది లేదు
- వచ్చే జూన్ వరకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్
- తాగునీరు, పశుగ్రాసానికి కొరత రావద్దు
- ప్రతి మండలానికి గ్రూప్–1, 2 అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ..

2

## రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం

- యూకే మేయర్ల బృందంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రానున్న రోజుల్లో తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి
- డిసెంబర్ 7–9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- బ్రిటన్ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం

ఈకబురు,హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన కొనసాగింపు ఉంటుందని, పెట్టుబ డులు సురక్షితంగా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి బ్రిటన్ ప్రతినిధి బృందానికి భరోసా ఇచ్చారు.

మిగతా 2లో



## ఏడో బ్లాక్ తొలగించాల్సిందే!

- మేడిగడ్డ బరాజ్‌పై సాంకేతిక పర్యవేక్షణ కమిటీ స్పష్టీకరణ
- ఢిల్లీలో కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణ పనుల ప్రాథమిక డిజైన్లపై చర్చ
- పలు మార్పులు సూచించిన కమిటీ
- బరాజ్‌లకు ఎగువ, దిగువన డయాఫ్రమ్ వాల్స్ ఏర్పాటు
- దిగువన కొత్త స్టిల్లింగ్ బేసిన్లు, కొత్త కటాఫ్ వాల్స్‌దిగువన కొత్త స్టిల్లింగ్ బేసిన్లు, కొత్త కటాఫ్ వాల్స్



2



## యువత దారికి అడ్డు రావొద్దు

- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ హితవు
- పోలీసుల దాడిలో గాయపడిన విద్యార్థులకు పరామర్శ
- అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా
- బాధ్యులు శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరిక
- తీవ్రంగా గాయపడ్డామని విద్యార్థుల ఆవేదన

ఈకబురు, న్యూఢిల్లీ: నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు ఈ దేశం గొంతుక అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. యువత దారికి అడ్డు రావొద్దని ప్రధాని నరేంద్ర మోదీకి సూచించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా గాయపడిన కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐకి చెందిన విద్యార్థులను రాహుల్ బుధవారం కలిశారు. ఢిల్లీ 10, జనపథ్‌లోని సోనియా గాంధీ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. నిరసనల సమయంలో విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

మిగతా 3లో

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

## బతుకమ్మ పండుగ




03

## ఏపీలో స్థానిక సమరం షురూ!



03

- స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల
- నవంబర్ 26 నుంచి మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు
- 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల సందడి
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలపైనా రాజకీయ పార్టీల గురి

## దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ



3

# క'రెంట్' కష్టాలు

- రోజుకు నాలుగు గంటలైనా నిరంతరాయంగా అందని విద్యుత్
- పంటలను కాపాడుకునేందుకు విరివిగా జనరేటర్ల వినియోగం
- రోజు అద్దె రూ.4 వేలపైనే, డీజిల్‌కు మరో రూ.3 వేలు
- పేలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు... పిలిచినా రాని సిబ్బంది.. రైతుల అవస్థలు
- ఫిర్యాదు ఏదైనా.. పరిష్కారానికి కాసులివ్వాల్సిందే

3



# బొగ్గు గనుల్లో 'కోల్‌మాల్'!



ఈకబురు,పెద్దపల్లి: సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ, కార్మికుల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాల్లో భాగంగానే తెలంగాణ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. అలాగే త్వరలో సింగరేణి సంస్థను అదానీ, అంబానీ వంటి వారి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేలా రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, మోదీలు కలిసి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకుండా, బొగ్గు ఉత్పత్తి తగ్గుదలకు కార్మికులను బాధ్యులుగా చూపే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉత్పత్తి అవుతున్న బొగ్గంతా ఎక్కడికి పోతోందని నిలదీశారు. 'సింగరేణిలో ఈ కోల్ మాల్ గోల్ మాల్ చేస్తున్న దొంగ ఎవరు? సిరుల సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చిన దుర్మార్గుడు ఎవరు? బొగ్గు గనిని అవినీతి ఖనిగా మార్చేసిన దగుల్బాజీ ఎవరు?..' అంటూ ధ్వజమెత్తారు. సింగరేణి, ఆర్టీసీతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బుధవారం నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు.

కమీషన్లు ముట్టకకే టెండర్లు వాయిదా

'సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. మా హయాంలో 70 మిలియన్ టన్నుల స్థాయికి చేరిన బొగ్గు ఉత్పత్తి.. ప్రస్తుతం 58 మిలియన్ టన్నులకు పడిపోయింది. ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ (ఓబీ) పనుల టెండర్లను సకాలంలో పూర్తి చేయకపోవడమే ఉత్పత్తి తగ్గుదలకు కారణం. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్‌లో ఓబీ టెండర్లు ఏడుసార్లు వాయిదా పడ్డాయి. దానికి కారణం కమీషన్లు ముట్టకపోవడమే.

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. కానీ అవి చెల్లించకుండా సంస్థను సంక్షోభంలోకి నెడుతోంది. డీజిల్, జిలెటిన్ స్టిక్స్, సోలార్ ప్రాజెక్టులు, జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్, నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లలో అవకతవకలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నందున జోక్యం చేసుకుని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన బావమరిది సృజన్‌రెడ్డి, శోధా కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారాలపై విచారణ జరపాలి..' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అవినీతి రైజింగ్..ప్రొడక్షన్ ఫాలింగ్

'ప్రస్తుతం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 4,000 మెగావాట్ల సామర్థ్యానికి అనుగుణంగా ఉత్పత్తి జరగడం లేదు. ఇందుకు సింగరేణి నుంచి బొగ్గు సరఫరా కావడం లేదనే కారణాన్ని చూపుతున్నారు. ఉత్పత్తి చేస్తున్న బొగ్గు అంతా ఎక్కడకు పోతోంది? ఎక్కడ మాయమైంది? ఈ బొగ్గును మెక్కిన బకాసురుడు ఎవరు? ఈ బొగ్గును మాయం చేసిన మాయల ఫకీరు ఎవరు? కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బొగ్గు కొరత లేదు, కరెంట్ కొరత లేదు? నీళ్లకు కొరత లేదు. పదేళ్లు బ్రహ్మాండంగా నడిచిన సింగరేణి ఇప్పుడెందుకు ఈ పరిస్థితిలో ఉంది? సింగరేణిలో బొగ్గు నిక్షేపాలు ఈ మూడేళ్లలో తగ్గిపోయాయా? లేదా సింగరేణి కార్మికులు కష్టం చేయడం తగ్గిందా? ఎందుకు బొగ్గు తగ్గిపోయింది? మొన్నీ మధ్య మన నాయకులు మొత్తం సింగరేణి ప్రాంతమంతా పర్యటించి 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని నిలదీస్తే.. 'లేదు లేదు ఉన్నది, బాయిలకాడ ఉంది' అని అబద్ధం చెప్పి తప్పించుకున్నారు. సింగరేణిలో ఇవాళ బొగ్గు ఉత్పత్తి లేదంటే దానికి కారణం కాంగ్రెస్ అవినీతి. బొగ్గు ఏడపోయింది అంటే.. అవినీతి రైజింగ్, ప్రొడక్షన్ ఫాలింగ్..

సంస్థలో కుంభకోణాల కుంభమేళా

సింగరేణిని ఇవాళ ఒక దండుపాళ్యం ముఠా దోచుకుంటున్నట్టు కాంగ్రెసోళ్లు దోచుకుంటున్నారు. రూ.10 వేల కోట్ల మేర కుంభకోణాలు సింగరేణిలో జరిగాయి. సైట్ విజిట్ సర్టిఫికెట్ కుంభకోణం, డీజిల్ కుంభకోణం, జిలెటిన్ స్టిక్స్ కుంభకోణం, సోలార్ కుంభకోణం, జైపూర్ పవర్ కుంభకోణం..ఇలా సింగరేణిలో కుంభకోణాల కుంభమేళా జరుగుతోంది. కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఓ చానెల్ ఇంటర్వ్యూలో స్వయంగా చెప్పిండు. సింగరేణిలో నైనీ కుంభకోణాన్ని ఆయన అడ్డుకోవడంతో ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయని. ఆ నిధులు మింగినోడు ఎవడు? మింగుదామనుకున్నోడు ఎవడో ప్రజలకు చెప్పాలి..' అని కేటీఆర్ అన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

'సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా, దసరా బోనస్, వారసత్వ ఉద్యోగాల విషయంలో అన్యాయం జరుగుతోంది. కార్మికుల హక్కులు, సంస్థ భవిష్యత్తు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలి. సింగరేణిని కాపాడే విషయంలో నాయకత్వం కేసీఆర్‌దే. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సింగరేణి, విద్యుత్ సంస్థలు సురక్షితంగా ఉంటాయి..' అని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కేటీఆర్ న్యూ లుక్ వెనుక 'గోదావరిఖని' సీక్రెట్

కేటీఆర్ తన కొత్త గడ్డం లుక్ వెనుక ఉన్న కారణాన్ని సభలో సరదాగా బయటపెట్టారు. వచ్చే దారిలో కరీంనగర్‌లో ఆగినప్పుడు గంగుల కమలాకర్.. 'అన్న గడ్డం పెంచినావ్?' అని అడిగారని, దానికి నేను 'పోయేది గోదావరిఖనికి, సింగరేణికి కదా.. ఆ మాత్రం గెటప్ ఉండాలి..లేకపోతే నడవదు..' అని చెప్పానని తెలిపారు. దీంతో సభలో నవ్వులు విరిశాయి.

# క'రెంట్' కష్టాలు



ఈకబురు,హైదరాబాద్: రైతులను కరెంట్ కష్టాలు వెంటాడుతున్నాయి. కాతాపూత సమయంలో కరెంట్ కన్నీళ్లు పెట్టిస్తోంది. వరి వేసిన రైతుకు విద్యుత్ శాఖ నిత్యం షాక్ ఇస్తోంది. అన్ని జిల్లాల్లోనూ రైతుల పరిస్థితి ఇదే. పగటి పూటే రైతుకు విద్యుత్ ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. పట్టుమని 4 గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందడం లేదని 'సాక్షి'ప్రతినిధుల బృందానికి రైతులు తెలిపారు. నిత్యం ఏదో ఒక అంతరాయం వెంటాడుతోందని, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడమో, లైన్లలో సమస్యలో, ఫ్యూజులు పోవడమో... ఏదైతేనేం ఏదో ఒక కారణంతో కరెంట్ పోతోందని లబోదిబోమంటున్నారు.

**కరెంట్ ఉంటే ఒట్టు**

రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్‌పై నిత్యం ఫిర్యాదులు నమోదవు తున్నాయి. కరెంట్ పోయినప్పుడల్లా సమీపంలోని కాల్‌సెంటర్‌కు ఫోన్లు చేస్తున్నారు. ఇలా రాష్ట్రంలోని రెండు డిస్కమ్‌ల పరిధిలో రోజుకు 250కిపైగా ఫిర్యాదులు అందుతున్నట్టు విద్యుత్ అధికారులే చెబుతున్నారు. తక్షణమే స్పందిస్తున్నామని విద్యుత్ వర్గాలు అంటున్నాయి. రాష్ట్రంలో 80 వేలకుపైగా బోర్లు ఉన్నాయి. సగటున ఒక్కో బోర్ 7 హార్స్‌పవర్‌తో ఉంటుంది.

ఒక హెచ్‌పీ మోటర్ గంట వేస్తే, ఒక యూనిట్ కాలుతుంది. రైతు కనీసం 10 గంటల పాటు మోటర్ పోస్తే తప్ప పంటను కాపాడుకునే అవకాశం లేదు. అంటే 56 లక్షల యూనిట్ల విద్యుత్ రైతులకే అవసరం. కానీ రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ రోజుకు 10 లక్షల యూనిట్లు దాటడం లేదని విద్యుత్ నియంత్రణ మండలికి డిస్కమ్‌లు సమర్పించే వార్షిక ఆదాయ, అవసర నివేదికలే స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ వంటి నగరాల్లో విద్యుత్ డిమాండ్ పెరగడంతో అక్కడి అవసరాలకే కేటాయిస్తున్నారు. దీంతో రైతులకు విద్యుత్ అందక అనేక అవస్థలు పడుతున్నాడు.

**జనరేటర్లతో తడిసి మోపెడు**

చేతికొచ్చిన పంటను ఎండబెట్టుకునేందుకు రైతులకు మనసు రావడం లేదు. గింజ గట్టిపడే సమయంలో నీళ్లు అందించేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. చాలా చోట్ల రైతులు అద్దెకు జనరేటర్లు తెచ్చి మరీ బోర్లు, బావుల నుంచి నీళ్లు తోడుతున్నారు. 480 మండలాల పరిధిలో వేల మంది రైతులకు ఇదే పరిస్థితి ఎదురైందని నివేదికలు చెబుతున్నాయి. ఒక్కో జనరేటర్‌కు రోజుకు రూ.3500 అద్దె చెల్లిస్తున్నారు. మరో రూ.2500 వరకూ డీజిల్ ఖర్చు అవుతోంది.

**పిలిస్తే పలికేదెవరు?**

నాణ్యమైన విద్యుత్ లేని కారణంగా రైతు మోటర్లు కాలిపోతున్నాయి. విద్యుత్ లోడ్ పెరిగిపోవడం, నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వాటిల్లో ఉపకరణాలు వేడికి దెబ్బ తింటున్నాయి. సమస్య ఎదురైనప్పుడు రైతులు విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను పొలాల వద్దకు చేరవేసేందుకు కూడా డబ్బులు అడుగుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. డబ్బులివ్వకపోతే రోజుల తరబడి వాటిని తేవడం లేదని, పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలోనూ దీనిపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.

**కరెంట్ ఆశలు సన్నగిల్లినట్టే**

వచ్చే జూలై వరకూ విద్యుత్, నీరు పొదుపుగా వాడాలని ప్రభుత్వమే చెబుతోంది. ఈ లెక్కన వ్యవసాయ విద్యుత్‌కు మరింత కోత పడే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల విద్యుత్ శాఖ విడుదల చేసిన వివరాలే ఇందుకు నిదర్శనం. విద్యుత్ డిమాండ్ ఇదే సీజన్‌లో గత ఏడాది 15,906 మెగావాట్లుగా ఉంటే, ఈ ఏడాది 19,892 మెగావాట్లకు చేరింది. గత ఏడాది జూలై-సెప్టెంబర్ మధ్య 22,319 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటే, 26,036 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంది. మరోవైపు బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనేందుకు దొరకడం లేదు. జెన్‌కో లాంటి ఉత్పత్తి సంస్థలకు బొగ్గు కొరత కారణంగా విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు. ఈ నేపథ్యంలో రబీ సీజన్ మాట దేవుడెరుగు... ఖరీఫ్‌లోనూ రైతన్నలకు కష్టాలు తప్పవని విద్యుత్ ఉన్నతాధికారులే అంగీకరిస్తున్నారు.

**ఇవీ రైతన్నల కష్టాలు...**

**కోనరావుపేట మండలం మరిమడ్లలో ఓ రైతు ఏడెకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. పొట్టకొచ్చే దశలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. అధికారులు స్పందించలేదు. రోజుకు రూ.5 వేల చొప్పున జనరేటర్ కిరాయికి తెచ్చుకొని, ఐదు రోజులుగా వరికి నీరు అందిస్తున్నాడు.**

- రాజన్నసిరిసిల్ల ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామ రైతులు వంద ఎకరాల్లో సాగు నీరు అందకపోవడంతో వరి పొట్ట దశలో దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనరేటర్లు తెద్దామన్నా దొరికే పరిస్థితి లేదని చెబుతున్నారు.
- మిర్యాలగూడ ప్రాంతంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతున్నాయి. రోజుల తరబడి వాటిని బాగు చేయడం లేదు. లోఓల్టేజీ కారణంగా రైతుల మోటర్లు కూడా దెబ్బతింటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ బిగించడానికీ పెద్ద ఎత్తున సిబ్బంది డబ్బులు అడుగుతున్నారు.
- సంగారెడ్డి జిల్లా హత్నూర్ మండలం తార్కాన్‌పేట గ్రామంలో ఓ రైతు ఆరెకరాలోల వరి వేశాడు. విద్యుత్ కోతల కారణంగా పంట దెబ్బతింటోంది. రోజుకు రూ.2 వేల చొప్పున అద్దెకు జనరేటర్ తెచ్చాడు. మరో రూ.4 వేలు డీజిల్‌కు ఖర్చు అవుతోందని తెలిపాడు.

**రోజుకు రూ.6 వేలు ఖర్చు చేస్తేనే..**

వరి పొలం వద్ద జనరేటర్ అమర్చుతున్న ఈ రైతు పేరు అల్లి మీరబాబు. సూర్యాపేట జిల్లా చిలుకూరు గ్రామానికి చెందిన ఈయన తొమ్మిది ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. పంట ఇప్పుడిప్పుడే పొట్ట దశకు చేరుకుంటోంది. అయితే కరెంట్ కోతలకు తోడు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నీళ్లందించే పరిస్థితి లేకుండాపోయింది. ఈ దశలో వరికి నీళ్లందించడం కీలకం కావడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రోజుకు ఆరు వేల రూపాయలు ఖర్చు చేస్తూ జనరేటర్ ద్వారా పంటకు నీళ్లందిస్తున్నాడు. అయితే ఇలా ఎన్ని రోజులు చేయగలనని నిస్సహాయంగా ప్రశ్నిస్తున్నాడు.

**ఇదేం కరెంట్**

వరి పొట్టకొచ్చే దశలో కరెంట్ కన్నీళ్లు పెట్టిస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడమో, ఫ్యూజులు ఎగిరిపోవడమో, వైర్లు తెగిపోవడమో.. రోజూ ఏదో ఒక సమస్యే. అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. -ఆకుల చిన నారాయణ, మరిమడ్ల, కోనారావుపేట మండలం

డబ్బులివ్వందే పనులు కావు

రోజుకు 6 గంటలు కూడా కరెంట్ ఉండటం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోతే రైతులంతా డబ్బులు వేసుకొని ఇవ్వాలి. లేకపోతే కరెంటోళ్లు అస్సలు పట్టించుకోరు. పై అధికారులకు అన్నీ తెలిసినా, ఏమీ తెలియనట్టు నటిస్తున్నారు.
-ధీరావత్ గోవింద్, రాళ్లవాగుతండా, మిర్యాలగూడ

**ట్యాంకర్ సేద్యం**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం మెల్లకుంటతండాకు చెందిన రైతులు కొర్ర తౌర్యకు అర ఎకరం, రమావత్ వసూరాం, రమావత్ హనుమ నాయక్‌లకు ఎకరంన్నర భూమి ఉంది. వరి సాగు చేయగా, నీరందక ఎండిపోతోంది. దీంతో వారు తండా సమీపంలోని మలాల్‌చెరువు నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.500 చొప్పున చెల్లిస్తూ రెండురోజుల్లో 40 ట్యాంకర్ల నీటిని తెప్పించామన్నారు.

**చి'వరి'ఆశ...**

పినపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారానికి చెందిన రైతు తెలగాని శేషయ్య తన ఇంటికి ఆనుకుని 80 సెంట్ల భూమిలో వరి సాగు చేశాడు. ఏటా వర్షాకాలంలో వరి సాగు చేస్తుండగా.. భూపాలపట్నం చెరువు కాల్వల ద్వారా నీరు అందేది. కానీ ఈసారి చెరువులోకి నీరు చేరకపోవడంతో శేషయ్య తన ఇంట్లోని బోర్‌కు ఉన్న సింగిల్ ఫేస్ మోటార్‌తో పైపు వేసి పంటను తడుపుతున్నాడు

# యువత దారికి అడ్డు రావొద్దు



ఈకబురు, న్యూఢిల్లీ: నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు ఈ దేశం గొంతుక అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. యువత దారికి అడ్డు రావొద్దని ప్రధాని నరేంద్ర మోదీకి సూచించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా గాయపడిన కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూకి చెందిన విద్యార్థులను రాహుల్ బుధవారం కలిశారు. ఢిల్లీ 10, జనపథ్‌లోని సోనియా గాంధీ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. నిరసనల సమయంలో విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

పోలీసుల అమానుష ప్రవర్తన గురించి, తమపై దాడి చేయడం గురించి రాహుల్‌కు విద్యార్థులు వివరించారు. పోలీసులు తమను దారుణంగా దూషించడమే కాకుండా, తమ జననేంద్రియాలపై కూడా కొట్టడం వల్ల తీవ్రంగా గాయపడ్డామని చెప్పారు. విద్యార్థుల ఆవేదన విని రాహుల్ గాంధీ చలించిపోయారు. ఎవరూ అందోళన చెందవద్దని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్థులను సింహాలు, ఆడసింహాలుగా అభివర్ణించారు. ఒక విద్యార్థినిని 'మన షేర్ని'గా పరిచయం చేశారు. ''ఆమెపై దాడి జరిగింది కానీ ఆమె భయపడలేదు. ఆమె హృదయంలో ఎలాంటి ద్వేషం లేదు''అని అన్నారు.

దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు

నరేంద్ర మోదీ, అమిత్ షాలు ప్రజల గొంతుకకు, వారి నిరసనకు ఎదురుగా నిలబడి ఉన్నారని రాహుల్ ఆక్షేపించారు. ప్రజలకు ఇంకా ఎదురుగా నిలబడవద్దని, అలా చేస్తే మీరు తట్టుకోలేరు అని మోదీ, అమిత్ షాలకు సూచించారు. ఈ దేశంలో కులం, మతం, లింగభేదాలు లేకుండా ప్రజలంతా ఒక్కటిగా కలిసి ఉన్నారని, వారిని ఎవరూ విడగొట్టలేరని చెప్పారు. పోలీసుల దాడిలో గాయపడిన విద్యార్థులంతా భుజం భుజం కలిపి నిలబడాలని రాహుల్ సూచించారు.

ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకుంటున్న ఓ విద్యార్థిని పోలీసుల దాడిలో వినికిడి శక్తి కోల్పోయిందని ఆరోపించారు. ఆమెకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. తమ విద్యార్థులపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ సహా తమ పిల్లలపై చేయి చేసుకున్న కానిస్టేబుళ్ల వరకు అందరినీ శిక్షిస్తామని ఉద్ఘాటించారు. రాహుల్ గాంధీతో మాట్లాడుతున్నప్పుడు ఓ విద్యార్థి మహాత్మా గాంధీకి ఇష్టమైన 'వైష్ణవ జనతో'అనే భజన గీతాన్ని వేణువుపై వాయించారు. ద్వేషానికి సమాధానం ప్రేమతోనే ఇస్తామని అన్నారు.

**వీడియోలు, ఫొటోలు భద్రపర్చుకోండి**

గాయపడిన విద్యార్థులతో భేటీ అనంతరం రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. ''మన ప్రజాస్వామ్య స్వరాన్ని అణచివేయాలని చూసేవారు చట్టం ఆగ్రహానికి గురయ్యే రోజు వస్తుంది. తప్పు చేసినవారు ఎవరైనా సరే శిక్ష అనుభవించక తప్పదు. పోలీసుల క్రూరత్వానికి, చట్టవిరుద్ధమైన నిర్బంధానికి గురైన విద్యార్థులు, యువతీ యువకులు దానికి సంబంధించిన వీడియో లు, ఫోటోలు భద్రపర్చుకోవాలి. అది చాలా అవసరం. బాధ్యులను శిక్షించడానికి అవి ఉపయోగపడతాయి. శాంతియుత నిరసన మీ హక్కు. దానిని ఎవరైనా లాక్కోవాలని చూస్తే సహించం'' అని స్పష్టం చేశారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ




ఈకబురు,,హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని డిజిపి సి. వి. ఆనంద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బోనాలు, బతుకమ్మ పండుగలకు విశేష ప్రాధాన్యం ఉందన్నారు. బుధవారం డిజిపి కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ చిన్నతనంలో అమ్మమ్మ ఇంట్లో బతుకమ్మ ఆడిన రోజులను గుర్తు చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా దసరా పండుగను వివిధ సంప్రదాయాలతో నిర్వహిస్తారని, గుజరాత్‌లో దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తే.. తెలంగాణలో గౌరమ్మను పూజిస్తూ బతుకమ్మను జరుపుకోవడం ప్రత్యేకత అని వివరించారు. బతుకమ్మ ప్రకృతిని ఆరాధించే పండుగ అని పేర్కొన్న ఆయన ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ వేడుకలు ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొంటూ ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిపి సి వి ఆనంద్ తో పాటుగా డిజి (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, డిజి (ఆర్గనైజేషన్) స్వాతి లక్రా, ఎ డి జి అకున్ సబర్వాల్, మల్టీ జోన్ I ఐ జి చంద్రశేఖర్‌రెడ్డి, ఐ జి రోడ్ సేఫ్టీ రమేష్ నాయుడు తో పాటుగా సీఐవోలు, ఎ ఓ లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో స్థానిక సమరం షురూ!



ఈకబురు,, అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సమరం అధికారికంగా మొదలైంది.. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోకాలంగా ఆశావహులు ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికారికంగా షెడ్యూల్ విడుదల అయింది.గ్రామస్థాయి నుంచి పట్టణ, నగర పాలక సంస్థల వరకు అన్ని స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పూర్తి ఏర్పాట్లు చేసింది.. ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను అత్యంత పకడ్బందీగా మూడు వేర్వేరు దశల్లో నిర్వహించనున్నారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 26వ తేదీన ప్రారంభం కానుంది.

ఇక రెండో విడత పోలింగ్ నవంబర్ 29న జరగనుండగా, మూడో తుది విడత పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 2వ తేదీన నిర్వహించనున్నారు. ప్రత్యేకత ఏమిటంటే, ప్రతి దశకు సంబంధించిన పోలింగ్ ముగిసిన వెంటనే అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.గ్రామ పంచాయతీలతో పాటు పట్టణ ప్రాంతాలపై కూడా అందరి దృష్టి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 100 అర్బన్ లోకల్ బాడీల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో 10 పంచాయతీలు, 77 మున్సిపాలిటీలతో పాటు 13 నగరపాలక సంస్థలు (కార్పొరేషన్లు) ఉన్నాయి. పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి ఈ నెల 28వ తేదీన పోలింగ్ ప్రక్రియ పూర్తి కానుంది. ఆ తర్వాత కేవలం రెండు రోజుల వ్యవధిలోనే, అంటే అక్టోబర్ 30వ తేదీన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహించి అధికారిక ఫలితాలను ప్రకటించనున్నారు.మరోవైపు, ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఎంపీటీసీ (MPTC), జెడ్పీటీసీ (ZPTC) స్థానాలకు సంబంధించిన ఎన్నికలను నవంబర్ 3వ తేదీన నిర్వహించనున్నారు. ఈ స్థానిక ప్రజాప్రతినిధుల ఎన్నికల ఫలితాలను నవంబర్ 5న ప్రకటించడంతో మొత్తం ప్రక్రియ కొలిక్కి రానుంది.

ఈ ఎన్నికల ప్రకటన వెలువడటంతో రాజకీయ పార్టీల నాయకులు, ఆశావహులు తమ ప్రచార వ్యూహాలకు పదును పెడుతున్నారు. అభ్యర్థుల ఎంపికపై ఇప్పటికే అంతర్గతంగా కసరత్తు ప్రారంభం కాగా, పల్లెల్లో ఎన్నికల సందడి అప్పుడే మొదలైంది. కొత్తగా ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు స్థానిక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాలకు ఏ విధంగా బాటలు వేస్తారనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఎన్నికలు రాబోయే రాజకీయ సమీకరణాలకు కూడా కీలకం కానున్నాయి.దీంతో అర్ధరాత్రి నుంచే రాష్ట్రం లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఇక పార్టీలు వెంటనే అభ్యర్థులు ఎంపిక, పొత్తులు క్లారిటీ వెంటనే చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

# మోసం ఎక్కడుందో ఇట్టే తెలుసుకోవచ్చు

ఈకబురు, దిల్లీ: ఆరేడుగురు సీనియర్ లాయర్లు ఒకేవైపు నిల్చొని వాదించడానికి సిద్ధమవడాన్ని బట్టి మోసం ఎటువైపుందో ఇట్టే తెలుసుకోవచ్చని.. ఇదేమీ పెద్ద కష్టంకాదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులను ఉద్దేశించి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుందరేష్ పేర్కొన్నారు. మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కూకట్‌పల్లి మండలంలోని శంషిగూడ గ్రామంలోని సర్వే నం.57లో ఉన్న ఆషంజాహి పైగా ఆస్తుల పంపకానికి సంబంధించి అక్తర్ జహాన్ బేగం అనే మహిళ దాఖలు చేసిన కేసును జస్టిస్ బాలచంద్రవరాలేతో కలిసి విచారించిన సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఇందులో ప్రతివాదుల జాబితాలో తెలంగాణ ప్రభుత్వంతోపాటు మొత్తం 315 మంది వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. 'ఇందులో దాగివున్న మోసాన్ని నిరూపించగలను. ఇదివరకు దాన్ని సుప్రీంకోర్టు కూడా బయటపెట్టింది' అని పేర్కొన్నారు. అప్పుడు జస్టిస్ సుందరేష్ స్పందిస్తూ ''మిస్టర్ వైద్యనాథన్... మీరేమీ ఇక్కడ నిరూపించాల్సిన అవసరం లేదు.

కనీసం ఆరేడుగురు న్యాయవాదులు అటువైపు నిలబడటమే విషయం ఏంటన్నది చెబుతోంది. అందువల్ల విషయం తెలుసుకోవడం మాకేమీ కష్టంకాదు. ఇది ప్రైవేటు వ్యక్తుల ఆస్తుల విభజనకు సంబంధించిన అంశం కాబట్టి ఇందులో కోర్టు ఇచ్చే తీర్పు ప్రభుత్వానికి వర్తించదు' అని అన్నారు. అందుకు వైద్యనాథన్ స్పందిస్తూ.. అది ప్రభుత్వ భూమి అని, అందువల్ల ప్రైవేటు వ్యక్తులు పరస్పరం ఒప్పందం చేసుకొని దాన్ని పంచుకోవడానికి వీల్లేదన్నారు. అందుకు జస్టిస్ సుందరేష్ స్పందిస్తూ.. 'ఈ ఆస్తిని స్వాధీనం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏవైనా చర్యలకు ఉపక్రమించిందా..?' అని ప్రశ్నించారు. అందుకు ఆయన స్పందిస్తూ.. ప్రస్తుతం ఈ భూమి అంతా ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని, దాన్ని ప్రైవేటు వ్యక్తులు తమకు పంపిణీచేయాలని అడుగుతున్నారని పేర్కొన్నారు. ప్రతివాదుల్లో ఒకరి తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ స్పందిస్తూ ఇనాం అబాలిషన్ యాక్ట్ కింద రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొందని, అందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీ చేసిందన్నారు. 50 ఏళ్లుగా ఈ భూమి వివిధ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని చెప్పారు. అయితే, 1959లో పిటిషనర్లు దాఖలుచేసిన సూట్ ఆధారంగా ప్రిలిమినరీ డిక్రీ జారీ అయిందన్నారు. ఆ సమయంలో జాగీర్ అడ్మినిస్ట్రేటర్‌గా ప్రభుత్వాన్ని చేర్చలేదని పేర్కొన్నారు. ఇలాంటి కేసులో ప్రభుత్వం జోక్యంచేసుకోవాల్సిన అవసరం లేదని, అయినప్పటికీ ప్రభుత్వం స్పందించి అప్పీల్ దాఖలుచేయడం తప్పని.. అందుకే ప్రభుత్వానికి సంబంధంలేని విషయంలో మీరెందుకు అప్పీల్ దాఖలుచేశారని ఇదివరకు జస్టిస్ రామసుబ్రహ్మణ్యం ధర్మాసనం ప్రశ్నించిందని గుర్తుచేశారు. అందుకే ఆ మొత్తం డిక్రీ ప్రొసీడింగ్స్ మోసపూరితమని ఆ ధర్మాసనం పేర్కొందన్నారు. అందుకు జస్టిస్ సుందరేష్ స్పందిస్తూ.. ''సివిల్ కేసుల గురించి ఎవరైనా ఇదే చెబుతారు. ప్రభుత్వ కేసులను చెడగొట్టడానికి ప్రత్యేకంగా ఎవ్వరూ అవసరం లేదు. ప్రభుత్వం, అక్కడున్న న్యాయవాదులే చాలు. ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన భాగ పరిష్కారాల కేసులో ప్రభుత్వం ఎందుకు తలదూర్చింది' అని ప్రశ్నించారు. ఇదే కోర్టులో మియాపూర్ భూములకు సంబంధించి దాఖలైన ఇలాంటి కేసులో తీర్పు వెలువడిన తర్వాత ఈ కేసును వింటామని చెబుతూ జస్టిస్ సుందరేష్ విచారణను వాయిదా వేశారు.






## ఐపీవో పరిమాణం సవరణకు
# మరింత గడువు

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టదలచిన కంపెనీలు తాజా ఈక్విటీ జారీ పరిమాణంలో 50 శాతం వరకూ సవరించుకునేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గడువు పెంచింది. ఇందుకు కొత్తగా ముసాయిదా పత్రాలు దాఖలు చేయకుండానే 2027 మార్చి 31వరకూ అనుమతించినట్లు దేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్స్ అసోసియేషన్(ఏఐబీఐ) ఒక ప్రకటనలో పేర్కొంది. తద్వారా అన్‌లిస్టెడ్ కంపెనీల నిధుల సమీకరణను సులభతరం చేసింది. తొలుత ఈ గడువు 2026 సెపెటెంబర్‌వరకూ ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన కంపెనీలకు అమల్లో ఉండేది. తాజా నిర్ణయంతో ఐపీవో చేపట్టే కంపెనీలు, మర్చంట్ బ్యాంకర్లకు భారీ ఉపశమనాన్ని కల్పిస్తుందని, మారుతున్న బిజినెస్ అవసరాలు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా స్పందించేందుకు వీలు చిక్కుతుందని ఏఐబీఐ పేర్కొంది.

గడువు పెంపు మరిన్ని ఐపీవోలకు దారి చూపుతుందని, జూలై-సెప్టెంబర్(క్యూ2)లో భారీ పెట్టుబడులు సమీకరణకు అవకాశమేర్పడిందని తెలియజేసింది. ఈ ఏడాది క్యూ2లో 69 మెయిన్‌బోర్డు కంపెనీలు ఐపీవోల ద్వారా రూ. 90,482 కోట్లు సమకూర్చుకున్న సంగతి తెలిసిందే. మరోపక్క 92 ఎస్ఎంఈలు సైతం రూ. 4,167 కోట్ల పెట్టుబడులు సమీకరించాయి. వెరసి మొత్తం రూ. 94,649 కోట్లు అందుకున్నాయి.




## ఏఐ హార్డ్‌వేర్‌కు అదానీ, జబిల్ జత..
# 50:50 వాటాతో జేవీ

న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) హార్డ్‌వేర్ తయారీకి వీలుగా అదానీ ఎంటర్‌ప్రైజెస్, యూఎస్ తయారీ కంపెనీ జబిల్ చేతులు కలిపాయి. సమాన వాటా(50:50) భాగస్వామ్యంతో దేశీయంగా ఏఐ, డేటా సెంటర్ పరికరాల తయారీకి భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేయనున్నాయి. కంప్యూటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో తాజా జేవీకి తెరతీశాయి. ప్రతిపాదిత వెంచర్ ఏఐ ర్యాక్‌లు, సర్వర్లు, స్టోరేజీ, నెట్‌వర్కింగ్ పరికరాలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ ఎక్విప్‌మెంట్ సిస్టమ్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ తయారీ, అసెంబ్లింగ్‌ను చేపట్టనుంది. తద్వారా హైపర్‌స్కేలర్స్, డేటా సెంటర్ ఆపరేటర్లతో పాటు.. దేశ, విదేశీ కస్టమర్లకు అవసరమైన మల్టీగిగావాట్ తయారీ ప్లాట్‌ఫామ్‌కు తెర లేవనుంది. కాగా.. జేవీ ఏర్పాటుకు వీలుగా అదానీ, జబిల్ అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. దేశీయంగా డేటా సెంటర్ల డిమాండ్‌తో 2030కల్లా 5-8 గిగావాట్ల సామర్థ్యాలను పరిశ్రమవర్గాలు అంచనా వేస్తున్నాయి. డేటా సెంటర్లు, క్లౌడ్, ఏఐ ఎకోసిస్టమ్స్ తదితరాలపై 50 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులు వెచ్చించే ప్రణాళికలున్నట్లు వెల్లడించాయి.




## పీబీ మనీకి ఓబీపీపీ లైసెన్స్ మంజూరు

దేశ ఆర్థిక రంగంలో రిటైల్ ఇన్వెస్టర్లకు సులభతరమైన పెట్టుబడి అవకాశాలను అందించేందుకు పలు కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా పైసాబజార్‌తో భాగస్వామ్యం కలిగిన 'పీబీ మనీ'కు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి 'ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫారమ్ ప్రొవైడర్' (ఓబీపీపీ) లైసెన్స్ లభించింది. ఈ లైసెన్స్ ద్వారా రిటైల్ మదుపరులకు బాండ్ మార్కెట్‌ను మరింత చేరువ చేయనున్నట్లు కంపెనీ తెలిపింది.

**ఎండ్-టు-ఎండ్ సేవలు**

ఈ కొత్త లైసెన్స్‌తో పీబీ మనీ సంస్థ బాండ్లలో పెట్టుబడులు పెట్టే కస్టమర్ల ప్రయాణాన్ని పూర్తిగా స్వయంగా నిర్వహించనుంది. ఇన్వెస్టర్ల ఆన్‌బోర్డింగ్, కేవైసీ ప్రక్రియ నుంచి మొదలుకుని, బాండ్ల అన్వేషణ, ఆర్డర్ ప్లేస్‌మెంట్, చెల్లింపుల సమన్వయం, పెట్టుబడి అనంతర సేవల వరకు అన్నింటినీ ఈ వేదిక చూసుకుంటుంది. పైసాబజార్‌తో కుదుర్చుకున్న వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న విస్తృత కస్టమర్ వర్గాలు పైసాబజార్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.

**రిటైల్ రంగానికి సరికొత్త ఆదాయ మార్గం**

సాధారణంగా బాండ్లు రిటైల్ ఇన్వెస్టర్లలో ఇంకా పూర్తిస్థాయిలో ప్రాచుర్యం పొందలేదు. అయితే ఇవి క్రమబద్ధమైన వడ్డీ ఆదాయాన్ని అందించడంతో పాటు పెట్టుబడి పోర్ట్‌ఫోలియోను విస్తరించుకోవడానికి (డైవర్సిఫికేషన్) ఎంతో దోహదపడతాయి. పెట్టుబడి ప్రక్రియపై పూర్తి నియంత్రణను కలిగి ఉండటం ద్వారా వినియోగదారులు బాండ్లను సులభంగా అర్థం చేసుకోవడానికి, అన్వేషించడానికి, పెట్టుబడులు పెట్టడానికి పీబీ మనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా పీబీ మనీ డైరెక్టర్, పైసాబజార్ సీఈఓ సంతోష్ అగర్వాల్ మాట్లాడుతూ..'వినియోగదారుల మారుతున్న ఆర్థిక అవసరాలను తీర్చడమే మా ప్రధాన ధ్యేయం. ఇందులో పెట్టుబడులు కీలకమైన భాగం. పీబీ మనీకి వచ్చిన ఓబీపీపీ లైసెన్స్ ద్వారా కస్టమర్లకు బాండ్ల పెట్టుబడి ప్రయాణం మరింత సులభతరమవుతుంది' అన్నారు.

# 2027లో జీతాలు ఎంత పెరగొచ్చు?



ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జాబ్ మార్కెట్‌లో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు ఏఐపై పెట్టుబడులు, మరోవైపు పెరుగుతున్న వ్యయాల నేపథ్యంలో కంపెనీలు ఉద్యోగుల జీతాల పెంపుపై ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలో 2027లో అసలు వేతనాలు పెరుగుతాయా.. పెరిగితే ఎంత మేర పెరగొచ్చు.. యాజమాన్యాలు ఏం ఆలోచిస్తున్నాయి?

2027లో ఉద్యోగుల వేతనాలు మోస్తరుగా పెరగనున్నాయి. వృద్ధి ఆశయాలు, పెరుగుతున్న శ్రామిక శక్తి వ్యయాలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కోసం పోటీని తీవ్రతరం చేస్తూ కంపెనీల యాజమాన్యాలు స్థిరమైన వేతన పరిహార బడ్జెట్లను నిర్వహిస్తున్న క్రమంలో 2027లో దేశంలో ఉద్యోగుల జీతాలు 9.1 శాతం మేర పెరుగుతాయని ఒక నివేదిక తెలిపింది. గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ అయోన్ 202627కు గానూ భారత్‌లో వార్షిక వేతన పెరుగుదల, టర్నోవర్ సర్వే ఈమేరకు అంచనా వేసింది. ఇది 2026లో నమోదైన వాస్తవ సగటు వేతన పెరుగుదల 9 శాతంతో పోలిస్తే పెద్దగా మారడం లేదు. ఈ సర్వే 45 పరిశ్రమలలో 1,200 కి పైగా సంస్థల డేటాను విశ్లేషించింది. దీంతో ఇది దేశంలోని అతిపెద్ద వేతన పరిహార అధ్యయనాలలో ఒకటిగా నిలిచింది.

**సర్వే ముఖ్యాంశాలు**

బలమైన దేశీయ వినియోగం, స్థిరమైన పెట్టుబడులు, ఎగుమతి వృద్ధి వ్యాపార విశ్వాసానికి మద్దతు ఇస్తూనే ఉన్నాయి. కంపెనీలు వ్యయ క్రమశిక్షణను కొనసాగిస్తూ ప్రతిభలో పెట్టుబడులు పెట్టడానికి వీలు కల్పిస్తాయి.

రంగాల వారీగా చూస్తే నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు 2027లో అత్యధికంగా 10.1 శాతం వేతన పెరుగుదలను అందించనున్నాయి. ఇంధన రంగంలో 9.9 శాతం, రియల్ ఎస్టేట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగంలో 9.8 శాతం వేతనాలు పెరిగే అవకాశం ఉంది.

ప్రతిభను నిలుపుకోవడంలో పెరుగుతున్న సవాళ్లను కూడా నివేదిక హైలైట్ చేసింది. మొత్తం అట్రిషన్ 2025లో 16.2 శాతం, 2024లో 17.1 శాతం నుండి 2026లో 18 శాతానికి పెరిగింది.

అదే సమయంలో, కంపెనీలు తమ కార్యకలాపాలలో ఏఐని వేగంగా ఏకీకృతం చేస్తున్నాయి. ఉత్పాదకతను AI సాధనాల స్వీకరణ సంవత్సరం క్రితం 46.1 శాతం ఉండగా 2026లో 56 శాతానికి పెరిగింది. అలాగే అన్ని ప్రధాన ఉద్యోగ కేటగిరీల్లోనూ ఏఐ వినియోగం విస్తరించింది. యాజమాన్యాలు జీతాల పెంపు విషయంలో లక్ష్య విధానాన్ని ఎక్కువగా అవలంబిస్తున్నారని అయోన్ టాలెంట్ సొల్యూషన్స్ ఇండియా పార్టనర్, రివార్డ్స్ కన్సల్టింగ్ లీడర్ రూపాంక్ చౌదరి తెలిపారు. "బలమైన దేశీయ వినియోగం, స్థిరమైన పెట్టుబడి, ఎగుమతి వృద్ధి వ్యాపార విశ్వాసానికి మద్దతు ఇస్తూనే ఉన్నాయి. యాజమాన్యాలు వ్యయ క్రమశిక్షణను కొనసాగిస్తూనే ప్రతిభలో పెట్టుబడి పెట్టడాన్ని కొనసాగిస్తున్నాయి" అని పేర్కొన్నారు. యాజమాన్యాలు విస్తృత శ్రామిక శక్తిని, వేతన కోడ్ వ్యయ చిక్కులను అంచనా వేయాలని, దీన్ని ఉద్యోగులకు మెరుగ్గా తెలియజేయాలని అయోన్ టాలెంట్ సొల్యూషన్స్ ఇండియా అసోసియేట్ పార్టనర్ అమిత్ కుమార్ ఒట్వానీ సూచించారు.



## ఇంట్లో మహారాణులు..
# పెట్టుబడుల్లో ప్రేక్షకులు!

అత్యంత ధనిక వర్గానికి చెందిన (అల్ట్రా హైనెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్‌యూహెచ్ఎన్ఐ) కుటుంబాల్లో కోట్లాది రూపాయల సంపద చేతులు మారుతున్నప్పటికీ సంపద నిర్వహణ, పెట్టుబడి నిర్ణయాల విషయంలో పురుషాధిక్యత స్పష్టంగా కనిపిస్తోంది. సుమారు మూడింట రెండొంతుల (66 శాతం కంటే ఎక్కువ) ప్రాతిపదికన అత్యధిక నికర ఆస్తులు కలిగిన భర్తలు తమ పెట్టుబడి నిర్ణయాల్లో తమ భార్యలను సంప్రదించడం లేదని అధ్యయన నివేదికలు చెబుతున్నాయి.

**నిర్ణయాధికారం పురుషుల చేతుల్లోనే!**

సాధారణంగా కుటుంబ ఆర్థిక విషయాల్లో మహిళలకు పూర్తిస్థాయి భాగస్వామ్యం లభిస్తోందని భావిస్తున్నప్పటికీ యూహెచ్ఎన్ఐ, హెచ్ఎన్ఐ విభాగాల్లో రియల్ ఎస్టేట్, ఈక్విటీ పోర్ట్‌ఫోలియో, ప్రైవేట్ ఈక్విటీ, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ వంటి కీలకమైన దీర్ఘకాలిక నిర్ణయాలను భర్తలే సొంతంగా తీసుకుంటున్నారు. ప్రాధాన్యత కలిగిన పెట్టుబడుల కేటాయింపుల్లో రిస్క్ తీసుకునే ధోరణిలో భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ చివరికి భర్తల నిర్ణయాలే ఆమోదం పొందుతున్నాయి.

**పోర్ట్‌ఫోలియోపై రిస్క్ ప్రభావం**

ఆర్థిక నిపుణులు, వెల్త్ మేనేజర్ల ప్రకారం పురుషులు సాధారణంగా అధిక రిస్క్ కలిగిన ఈక్విటీలు లేదా స్పెక్యులేటివ్ అసెట్స్ వైపు మొగ్గు చూపుతారు. అయితే, మహిళలు సంపద సంరక్షణ, క్రమశిక్షణతో కూడిన వైవిధ్యీకరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. పెట్టుబడి ప్రక్రియలో భార్యలను భాగస్వాములను చేయకపోవడం వల్ల ఏదైనా ప్రతికూల మార్కెట్ పరిణామం చోటుచేసుకున్నప్పుడు కుటుంబంలో ఆర్థిక భద్రత, స్థిరత్వానికి విఘాతం కలిగే ప్రమాదం ఉందని మార్కెట్ రంగానికి చెందిన నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**తరం మారుతున్నా సవాళ్లు తప్పవా?**

యువ తరం (మిలెనియల్స్) కొద్దివరకు తమ భాగస్వాములతో కలిసి నిర్ణయాలు తీసుకునేందుకు సుముఖత చూపుతున్నప్పటికీ ఇప్పటికీ మెజారిటీ కుటుంబాల్లో ప్రాథమిక నిర్ణయాధికారిగా భర్తే వ్యవహరిస్తున్నాడు. వెల్త్ మేనేజ్‌మెంట్ సేవలందిస్తున్న సంస్థలు ఈ ధోరణిని గమనించి ఇద్దరినీ భాగస్వాములను చేస్తూ ఉమ్మడి ప్రణాళికలను రూపొందించడానికి ఉత్సాహం చూపిస్తున్నాయి.

**పరిష్కారం వైపు ప్రయాణం**

అకస్మాత్తుగా ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు కుటుంబంలో ఆర్థిక నిర్వహణ లోపించకుండా ఉండాలంటే ప్రారంభం నుంచే పెట్టుబడి నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబ సంపద సృష్టి ఎంత ముఖ్యమో దాని భద్రత, పారదర్శకమైన నిర్వహణ కూడా అంతే ప్రాధాన్యమైనవని స్పష్టం చేస్తున్నారు.



# ఫార్మా, హెల్త్ కేర్ షేర్లు ఢమాల్!

**దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఫార్మా, హెల్త్ కేర్ షేర్లు భారీగా అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 251.89 పాయింట్లు లేదా 0.34 శాతం క్షీణించి 72,781.89 వద్ద, నిఫ్టీ 99.25 పాయింట్లు లేదా 0.44 శాతం క్షీణించి 22,622.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీలో శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, బజాజ్ ఫైనాన్స్ టాప్ లూజర్స్ గా నిలిచాయి. విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ వరుసగా 0.08 శాతం, 0.32 శాతం క్షీణించాయి. రంగాల వారీగా, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్ కేర్ షేర్లు అత్యధికంగా నష్టపోగా నిఫ్టీ ఐటీ అత్యధికంగా పెరిగింది.**

# దసరా వేళ మారుతి కార్లపై భారీ ఆఫర్లు.. రూ.1.36 లక్షల వరకు!

పండుగ సీజన్‌లో కొత్త కారు కొనాలనుకుంటున్నారా? అయితే మారుతి సుజుకి కార్లపై అక్టోబర్‌లో అందుబాటులో ఉన్న ఆఫర్లను పరిశీలించవచ్చు. దేశీయ కార్ల మార్కెట్లో ప్రముఖ సంస్థగా ఉన్న మారుతి సుజుకి.. గ్రాండ్ విటారా, ఇన్విక్టో, ఎక్స్‌ఎల్ 6, జిమ్నీ, ఫ్రాంక్స్, ఇవిటారా మోడళ్లపై వివిధ ప్రయోజనాలను అందిస్తోంది. మోడల్, వేరియంట్‌ను బట్టి నగదు తగ్గింపులు, పాత కారు మార్పిడిపై బోనస్‌లు, లాయల్టీ ప్రయోజనాలు, ఎక్స్‌టెండెడ్ వారంటీ వంటి ఆఫర్లు ఉన్నాయి.




**గ్రాండ్ విటారాపై అత్యధిక ప్రయోజనాలు**

మారుతి సుజుకి గ్రాండ్ విటారా కొనుగోలుదారులకు వేరియంట్‌ను బట్టి ఆఫర్లు మారుతున్నాయి. పెట్రోల్ సిగ్మా వేరియంట్‌పై గరిష్ఠంగా రూ.1.36 లక్షల వరకు ప్రయోజనాలు లభిస్తాయి. డెల్టా పెట్రోల్ వేరియంట్‌పై రూ.1.26 లక్షల వరకు, జీటా, ఆల్ఫా పెట్రోల్‌తో పాటు ఆల్‌వీల్ డ్రైవ్ (AWD) వేరియంట్లపై రూ.1.15 లక్షల వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి. జీటా, ఆల్ఫా, AWD వేరియంట్లకు ఐదేళ్ల ఎక్స్‌టెండెడ్ వారంటీ ప్యాకేజీ కూడా ఆఫర్‌లో భాగంగా ఉంది.

స్ట్రాంగ్ హైబ్రిడ్ గ్రాండ్ విటారా కొనుగోలుదారులకు ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ వేరియంట్లపై రూ.1.20 లక్షల వరకు ఇతర ఆఫర్లతో పాటు, అర్హత ఉన్న రాష్ట్రాల్లో రోడ్డు పన్ను మినహాయింపు లభించవచ్చు. రాష్ట్రాన్ని బట్టి ఈ పన్ను ప్రయోజనం రూ.1.85 లక్షల వరకు ఉండే అవకాశం ఉంది. అయితే రోడ్డు పన్ను మినహాయింపు అన్ని రాష్ట్రాల్లో ఒకే విధంగా వర్తించదు.

గ్రాండ్ విటారా CNG వేరియంట్లలోనూ ప్రయోజనాలు ఉన్నాయి. డెల్టా CNGపై రూ.1 లక్ష వరకు, జీటా CNGపై రూ.90,000 వరకు ప్రయోజనాలు లభించే అవకాశం ఉంది. వేరియంట్, అర్హతను బట్టి ఈ మొత్తాలు మారవచ్చు.

**ఇన్విక్టోపై రూ.95,000 వరకు ఆఫర్**

ప్రీమియం ఎంపీవీ మారుతి సుజుకి ఇన్విక్టోపై రూ.95,000 వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో రూ.50,000 ఎక్స్ఛేంజ్ బెనిఫిట్, రూ.30,000 లాయల్టీ బోనస్, అర్హత ఉన్న కొనుగోలుదారులకు రూ.15,000 కార్పొరేట్ ఆఫర్ ఉన్నాయి.

**ఎక్స్‌ఎల్6పై రూ.61,000 వరకు బెనిఫిట్స్**

మారుతి ఎక్స్‌ఎల్ 6 పెట్రోల్ మాన్యువల్, ఆటోమేటిక్ వేరియంట్లపై రూ.61,000 వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో నగదు తగ్గింపు, పండుగ బుకింగ్ ఆఫర్, ఎక్స్ఛేంజ్ బెనిఫిట్, అదనపు ఎక్స్ఛేంజ్ బోనస్ వంటి అంశాలు ఉంటాయి. CNG వేరియంట్లపై రూ.50,000 వరకు ప్రయోజనాలు లభించవచ్చు.

**జిమ్నీపై రూ.35,000 నగదు తగ్గింపు**

ఆఫ్‌రోడింగ్ సామర్థ్యానికి పేరొందిన మారుతి జిమ్నీపై అన్ని వేరియంట్లకు రూ.35,000 వరకు నగదు తగ్గింపు అందుబాటులో ఉంది. అయితే దీనికి అదనపు ఎక్స్ఛేంజ్, లాయల్టీ లేదా కార్పొరేట్ బోనస్‌లు వర్తించవు.

**ఫ్రాంక్స్‌పై రూ.27,100 వరకు ప్రయోజనాలు**

మారుతి ఫ్రాంక్స్‌లో 1.0 లీటర్ టర్బో పెట్రోల్ వేరియంట్లకు గరిష్ఠంగా రూ.27,100 వరకు ప్రయోజనాలు లభిస్తాయి. 1.2 లీటర్ సాధారణ పెట్రోల్ వేరియంట్లపై రూ.22,100 వరకు, CNG వేరియంట్లపై రూ.15,000 వరకు ఆఫర్లు ఉన్నాయి. వీటిలో నగదు ప్రయోజనాలు, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ఇతర అర్హత ఆధారిత ప్రోత్సాహకాలు ఉండవచ్చు. అయితే అన్ని వేరియంట్లకు ఒకే మొత్తంలో తగ్గింపు ఉండదు.

**ఈ-విటారాతో ఉచిత ఛార్జర్**

ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మారుతి ఈవిటారా కొనుగోలుదారులకు రూ.30,000 వరకు ఎక్స్ఛేంజ్ ప్రయోజనంతో పాటు ఉచిత ఛార్జర్, ఇంటి వద్ద ఛార్జర్ ఇన్‌స్టాలేషన్ ప్యాకేజీ అందుబాటులో ఉంది. ఎలక్ట్రిక్ కారును తొలిసారి కొనుగోలు చేసేవారికి ఇంటి ఛార్జింగ్ ఏర్పాట్లపై అయ్యే ప్రారంభ ఖర్చును తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుంది. అయితే ఛార్జర్, ఇన్‌స్టాలేషన్ ప్యాకేజీకి సంబంధించిన షరతులు, ఎక్స్ఛేంజ్ వాహనం వయసు, అర్హతలను ముందుగానే తెలుసుకోవాలి.

**పాత కారు ఉంటే అదనపు ప్రయోజనాలు**

పాత కారును మార్చి కొత్త మారుతి కారును కొనుగోలు చేసేవారికి ఎక్స్ఛేంజ్ బోనస్‌లు ఉపయోగపడవచ్చు. ఆరు సంవత్సరాల లోపు వయసున్న ఎక్స్ఛేంజ్ వాహనాలకు కొన్ని మోడళ్లపై అదనపు బోనస్ కూడా లభించవచ్చు. పాత మారుతి కారును ఇచ్చి మరో మారుతి కారును కొనుగోలు చేసే ప్రస్తుత కస్టమర్లకు లాయల్టీ ప్రయోజనాలు వర్తించే అవకాశం ఉంది.

15 సంవత్సరాలకు పైబడిన వాహనాలకు స్క్రాపేజ్ పథకం కింద ప్రయోజనాలు లభించవచ్చని ఆఫర్ వివరాలు సూచిస్తున్నాయి. అయితే ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ బోనస్ రెండింటినీ ఒకేసారి పొందడం సాధ్యం కాకపోవచ్చు. అర్హత ఉన్న కస్టమర్లు తమకు ఏ ఎంపిక వల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుందో పోల్చి చూడాలి.

# గోపీచంద్ 'భరతవర్ష'.. తొలి పాట విడుదల



గోపీచంద్ (T Gopichand), రీతూ వర్మ (Ritu Varma) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హిస్టారికల్ డ్రామా చిత్రం 'భరతవర్ష: సాగా ఆఫ్ శూల' (BharataVarsha). 'ఘాజీ', 'అంతరిక్షం' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న సంకల్ప్ రెడ్డి తెరకెక్కిస్తున్నారు. 642ఏడీ నేపథ్యంలో సాగే కథతో ఇది రూపొందుతోంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. అనుదీప్ దేవ్ స్వరాలందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'అమ్మ కదిలి వచ్చె..' అంటూ సాగే ఆ గీతం ఆకట్టుకుంటోంది.





# రామ్‌చరణ్ సుకుమార్ కాంబోపై బిగ్ అప్డేట్

'రంగస్థలం' లాంటి ఘనవిజయం తరువాత రామ్‌చరణ్ (Ram Charan) సుకుమార్ (Sukumar) కాంబోలో మరో చిత్రం రానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ (Mythri Movie Makers) బిగ్ అప్డేట్ ఇచ్చింది. ఈ సినిమా కోసం మాస్టర్‌మైండ్ డెన్‌లో అడుగుపెట్టారని పేర్కొంటూ.. సుకుమార్ నిర్మాత రవిశంకర్‌తోపాటు రచయితల బృందంతో కలిసి సినిమా ఆఫీసులో ఉన్న ఫొటోను పంచుకుంది. త్వరలోనే పూజా కార్యక్రమాలతో 'ఆర్‌సీ 17' (#RC17) ప్రయాణం ప్రారంభమవుతుందని వెల్లడించింది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన విశేషాల కోసం సిద్ధంగా ఉండాలని తెలిపింది. 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాలతో పాన్‌ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు సుకుమార్. జాతీయ పురస్కారం కూడా అందుకున్నారు. దీంతో రామ్‌చరణ్‌తో ఆయన తెరకెక్కించబోయే సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందుకు తగ్గట్లే పాన్‌ఇండియా ప్రేక్షకులను ఆకట్టుకొనే కథతో సుకుమార్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దనున్నట్లు తెలుస్తోంది. మరి ఈ మూవీలో రామ్‌చరణ్‌కు జోడీగా నటించే కథానాయికతో పాటు కీలక పాత్రల్లో కనిపించే నటుల వివరాలు తెలి యాల్సి ఉంది.



# ఒకే రకమైన పాత్రలకే పరిమితం కాను.. భిన్నమైన రోల్స్ నా లక్ష్యం: భాగ్యశ్రీ బోర్సే

'లెనిన్' సినిమాతో భారీ విజయాన్ని సాధించిన యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. వరుస చాన్స్‌లతో జోరుమీదున్నారు. 'ఆపరేషన్ గంగా' అనే యాక్షన్ సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టబోతున్న ఈ భామ తాజాగా, ఓ ఇంటర్వ్యూలోసినిమాల ఎంపిక గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. మనం చేసే సినిమాలను ఎలా ఎంచుకుంటాం, మనల్ని మనం ప్రేక్షకులకు ఎలా చూపించుకుంటాం అనే దానిపైనే మనకు వచ్చే పాత్రలు ఆధారపడి ఉంటాయని భాగ్యశ్రీ చెప్పారు. తాను ఇప్పటివరకు 'కాంత, లెనిన్, కింగ్‌డమ్ వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో అలరించానని తెలిపారు. ఇప్పుడు నటిగా తన లక్ష్యం అన్ని రకాల పాత్రలను వెతకడం, ప్రతి సినిమాలోనూ మరింత బాగా నటించడం అని చెప్పారు. ఏ పాత్ర ఇచ్చినా సరే దానిని అద్భుతంగా చేయగలననే గట్టి నమ్మకం తనకు ఉందని తెలిపారు. అందుకే తాను ఒకే రకమైన పాత్రలకే పరిమితం అయిపోతానేమోనని ఎప్పుడూ ఆందోళన చెందనని, భిన్నమైన పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరించడమేనని చెప్పుకొచ్చారు.



# బెల్లంకొండ శ్రీనివాస్ మిస్టిక్ థ్రిల్లర్ 'హైందవ' టీజర్

ఈ ఏడాది పెళ్లి చేసుకున్న హీరో బెల్లంకొండ శ్రీనివాస్.. కాస్త గ్యాప్ తీసుకుని కొత్త సినిమాతో వచ్చేస్తున్నాడు. అదే 'హైందవ'. దేవుడి కాన్సెప్ట్‌కి థ్రిల్లర్ కథని జోడించి తీశారు. తాజాగా టీజర్ రిలీజ్ చేసిన టీమ్.. మూవీ విడుదల తేదీని కూడా వెల్లడించారు. సంయుక్త మేనన్ హీరోయిన్ కాగా లుధీర్ బైరెడ్డి దర్శకుడు. రంగాపురం అనే ఊరిలో ఉండే గుడిలో విగ్రహాలు కనిపించకుండాపోతాయి. మరోవైపు ఓ వ్యక్తి చనిపోతాడు. ఈ కేసుని దర్యాప్తు చేసేందుకు పోలీస్ అయిన హీరో వస్తాడు. దేవుడంటే పెద్దగా నమ్మకం లేని ఇతడు.. ఈ విగ్రహాలు మిస్సింగ్ కేసుని ఎలా డీల్ చేశాడు? ఈ క్రమంలో ఏం తెలుసుకున్నాడనేది స్టోరీలా అనిపిస్తుంది. వచ్చే నెల 27న మూవీని థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. టీజర్‌లోని విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగున్నాయి. 'ఏం జరుగుతుందో చెప్పి, ఎలా జరుగుతుందో చూడమనే వాడే నయ్యా.. దేవుడంటే' డైలాగ్ కూడా ఆసక్తికరంగా అనిపించింది. మరి మూవీ ప్రేక్షకుల్ని ఏ మేరకు అలరిస్తుందో చూడాలి?

# పుట్టినరోజునా 'కింగ్' టీజర్ ట్రీట్!



దాదాపు మూడేళ్ల తర్వాత 'కింగ్' సినిమాతో తెరపై సందడి చేయనున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. ఆయన కుమార్తె సుహానా ఖాన్, అభిషేక్ బచ్చన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొణె కథానాయిక. క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం గురించి తాజాగా ఓ ఆసక్తికర కబురు వినిపిస్తోంది. నవంబరు 2న షారుక్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపించనున్న షారుక్.. హీరోయిన్ కరీనా కపూర్‌తో కలిసి 'డాడీ కూల్' అనే ఓ ప్రత్యేక గీతంలో స్టెప్పులేసేందుకు సన్నద్ధమయ్యారని ఇటీవల ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడదే చివరి షెడ్యూల్‌లో ఈ పాటతో పాటు సుహానాతో యాక్షన్ ఘట్టాలను తీర్చిదిద్ది, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్నీ శరవేగంగా పూర్తి చేసేందుకు చిత్రబృందం ప్రణాళిక రచిస్తోంది.





# పాఠ్యపుస్తకాలు చెప్పని వాస్తవాలను 'రణబాలి' చెబుతోంది: అన్నామలై

విజయ్ దేవరకొండ (Vijay Deverakonda) కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రష్మిక కథానాయిక. సుమారు 200 ఏళ్ల క్రితం దక్షిణాదిలో సంభవించిన మహా కరవు, ఆ సమయంలో బ్రిటిషర్ల దాష్టీకాలను కళ్లకు కడుతూ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చరిత్రలో కనిపించకుండా దాచిన సంఘటలను ఈ సినిమా ప్రజల ముందు ఉంచుతుందని చిత్రబృందం చెబుతోంది. దసరా కానుకగా అక్టోబరు 16న (ranabaali release date) ఈ మూవీ విడుదల కానుంది. ఈ సందర్భంగా బ్రిటిషర్లు దాచేసిన దేశ చరిత్రలోని పలు అంశాలపై మాజీ ఐపీఎస్ అధికారి, రాజకీయ నాయకుడు అన్నామలై, న్యాయవాది జె.సాయిదీపక్‌లతో విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ సంభాషించారు. దీనికి సంబంధించిన వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేసింది. ఇందులో అన్నామలై మాట్లాడుతూ.. ''చరిత్రలోని ఎన్నో విషయాలను బ్రిటిషర్లు తొక్కిపెట్టారు. అన్ని వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకొని వాస్తవాలను దాచారు. అందుకే మనం స్కూల్లో చదువుకొనే పాఠ్యపుస్తకాల్లోనూ వాటి ప్రస్తావన ఉండదు. బ్రిటిషర్ల అసలు ఉద్దేశాన్ని గుర్తించకుండా, వారు దేశానికి ఎన్నో మంచి పనులు చేశారని కీర్తించే పరిస్థితి వచ్చింది. పాఠ్యపుస్తకాలు చెప్పని వాస్తవాలను ఈ సినిమా చెప్పే ప్రయత్నం చేస్తోంది. అందుకు అభినందనలు'' అని పేర్కొన్నారు.

# 'కరికాల'లో గాయత్రీ భరద్వాజ్.. ఆకట్టుకుంటున్న స్పెషల్ పోస్టర్

'శంబాల' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కరికాల'. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం మొదటి చాప్టర్ 2027 జూలై 2న విడుదల కానుంది. ఇక రెండో చాప్టర్ 2027 అక్టోబర్ 28న విడుదల కాబోతోన్నట్టుగా మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై బజ్‌ను క్రియేట్ చేశాయి. రీసెంటుగా ఈ చిత్రం నుంచి కేథరిన్ థ్రెసా, సాక్షి మదోల్కర్ నటించనున్నట్టుగా ప్రకటించారు. తాజాగా ఈ సినిమాలో గాయత్రి భరద్వాజ్ కూడా ముఖ్య పాత్రను పోషించబోతోన్నారని మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు వెల్కమ్ ఆన్ బోర్డ్ అంటూ 'కరికాల' టీం స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. వరల్డ్ క్లాస్ టెక్నాలజీ, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్, అత్యద్భుతమైన కథనంతో 'కరికాల' పాన్ ఇండియన్ సినిమాగా రాబోతోంది. భారతీయ ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన సోషియో-ఫాంటసీ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా 'కరికాల' టీం పని చేస్తోంది. ఈ సినిమాకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 15న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరగబోతోన్నాయి. ఈ కార్యక్రమంలో అతిరథ మహారథులంతా పాల్గొని సందడి చేయనున్నారు.

## నాలుగో టీ20లో భారత్ ఓటమి

### హోప్ అజేయ శతకం
### సిరీస్ సమం చేసిన వెస్టిండీస్

హైదరాబాద్

తొలి టీ20 మనది.. రెండోది వాళ్లది. మూడో టీ20లో భారత్ పైచేయి సాధించింది. ఇప్పుడు నాలుగో మ్యాచ్‌ను విండీస్ సొంతం చేసుకుంది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షై హోప్ (102 నాటౌట్; 50 బంతుల్లో 4×4, 9×6) అజేయ శతకానికి.. షెర్ఫానీ రూథర్‌ఫర్డ్ (49 నాటౌట్; 26 బంతుల్లో 4×4, 3×6), హెట్‌మయర్ (33; 12 బంతుల్లో 4×4, 2×6) మెరుపులు తోడవడంతో మొదట విండీస్ 3 వికెట్లకు 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం టీమ్‌ఇండియా 19.3 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. సంజు శాంసన్ (56; 23 బంతుల్లో 6×4, 4×6)తో పాటు తిలక్ వర్మ (43; 25 బంతుల్లో 2×4, 3×6), నితీశ్‌కుమార్‌రెడ్డి (41; 20 బంతుల్లో 1×4, 4×6) రాణించారు. కీమో పాల్ (5/41), గుడాకేశ్ మోటీ (2/13) భారత్‌ను దెబ్బ తీశారు. నిర్ణయాత్మక చివరి టీ20 శనివారం బెంగళూరులో జరుగుతుంది.

**ఆరంభం అదిరింది కానీ..:** ఈ సిరీస్ రెండో మ్యాచ్‌లో 250 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిస్తే 10 బంతులుండగానే ఛేదించేసింది విండీస్. బ్యాటింగ్‌కు పూర్తి అనుకూలమైన ఉప్పల్‌లో 248 పరుగుల ఛేదన అంటే మరీ కష్టమేమీ కాదు. కావాల్సిందల్లా బలమైన ఆరంభమే. సంజు శాంసన్ జట్టు కోరుకున్న పునాదే వేశాడు. రెండో ఓవర్లో (షమార్) 4, 6, 6.. మూడో ఓవర్లో (ఛేజ్) 4, 6, 2, 2, 6, 4.. నాలుగో ఓవర్లో (షెఫర్డ్) 4, 4.. ఇదీ సంజు విధ్వంసం సాగిన తీరు. అద్భుత టైమింగ్‌తో అతను బంతిని పదే పదే బౌండరీకి తరలిస్తుంటే ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. 3.4 ఓవర్లకే 20 బంతుల్లోనే అతడి అర్ధశతకం పూర్తయింది. 4 ఓవర్లకే స్కోరు 60 పరుగులకే చేరుకుంది. మరో ఓపెనర్ అభిషేక్ (29) అప్పటికి 3 బంతులే ఆడాడు. అయితే తర్వాతి ఓవర్లో భారత్‌కు డబుల్ షాక్ తగిలింది. తొలి బంతికి సంజును, నాలుగో బంతికి ఇషాన్ (6)ను ఔట్ చేసి భారత్‌ను గట్టి దెబ్బ తీశాడు కీమో పాల్. ఇక్కడి నుంచి ఏ దశలోనూ భారత్ గెలుపు బాటలో సాగలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16) విఫలమయ్యాడు. అభిషేక్ శర్మ మామూలుగా 12వ ఓవర్ వరకు ఉన్నాడంటే సెంచరీ కొట్టేయాలి. కానీ అతను 24 బంతులాడి 29 పరుగులే చేశాడు. స్పిన్నర్ మోటీ 12వ ఓవర్లో అభిషేక్, నమన్ ధీర్ (0)లను ఔట్ చేయడంతో భారత్ 130/5తో ఇబ్బందుల్లో పడింది. అయితే ఆశలు సన్నగిల్లిన స్థితిలో తిలక్, నితీశ్ గొప్పగా పోరాడారు. ఒత్తిడిలో ఇద్దరూ భారీ షాట్లు ఆడారు. ముఖ్యంగా నితీశ్ సూపర్ సిక్సర్లతో అలరించాడు. అయితే ఈ జోడీ ఎంతగా పోరాడినా.. సమీకరణం అందుబాటులోకి రాలేదు. 19 బంతుల్లో 48 పరుగులు చేయాల్సిన స్థితిలో తిలక్ ఔటైపోయాడు. 19వ ఓవర్లో కీమో పాల్.. నితీశ్, ప్రిన్స్ (0), అక్షర్ (3)లను ఔట్ చేసి 5 వికెట్ల ప్రదర్శన పూర్తి చేయడంతో టీమ్‌ఇండియా పనైపోయింది. అర్ష్‌దీప్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడంతో 3 బంతులుండగానే భారత్ ఇన్నింగ్స్ ముగిసిపోయింది.

**కెప్టెన్ ధనాధన్:** మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన విండీస్.. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన ఉప్పల్ స్టేడియంలో పరుగుల పంట పండించింది. ఈ పర్యటనలో సంచలన ఫామ్‌తో భారత బౌలర్లను సతాయిస్తున్న విండీస్ కెప్టెన్ హోప్.. రెండు వారాల వ్యవధిలో భారత్‌పై నాలుగో సెంచరీ బాదేశాడు. మంచినీళ్ల ప్రాయంగా ఫోర్లు, సిక్స్‌లు కొడుతూ ఓ ఎండ్‌లో హోప్ చెలరేగుతుంటే.. మరో ఎండ్‌లో మిగతా కరీబియన్ బ్యాటర్లు కూడా ఓ చేయి వేయడంతో భారత్‌కు విండీస్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. కామిల్ పూరన్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన జువెల్ ఆండ్రూ (21; 16 బంతుల్లో 2×4, 1×6)తో కలిసి హోప్ జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. ఆండ్రూను అయిదో ఓవర్లో అక్షర్ పటేల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా.. భారత్ పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లయింది. హెట్‌మయర్ వచ్చీ రాగానే బ్యాటుకు పని చెప్పేశాడు. దొరికిన బంతిని దొరికినట్లు బౌండరీకి పంపించేశాడు. మరో ఎండ్‌లో హోప్ కూడా సమయోచితంగా షాట్లు ఆడడంతో 8 ఓవర్లకు విండీస్ 109/1తో తిరుగులేని స్థితికి చేరుకుంది. అప్పటికే భారత్ అయిదుగురు బౌలర్లను ప్రయోగించింది. హెట్‌మయర్‌ను రిటర్న్ క్యాచ్‌తో ప్రిన్స్ యాదవ్ ఔట్ చేయడంతో భారత్‌కు కాసేపు ఉపశమనం దక్కింది. 912 మధ్య 3 ఓవర్లలో 20 పరుగులే వచ్చాయి. అయితే నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించిన రోమన్ పావెల్.. అక్షర్ వేసిన 12వ ఓవర్లో 4, 6, 4తో చెలరేగాడు. హోప్ కూడా ఓ సిక్స్ బాదడంతో ఈ ఓవర్లో 22 పరుగులొచ్చాయి. పావెల్‌ను అర్ష్‌దీప్ ఔట్ చేసినా.. విండీస్‌కు ఇబ్బంది లేకపోయింది. సూపర్ ఫామ్‌లో ఉన్న రూథర్‌ఫర్డ్.. భారత బౌలర్లను ఏమాత్రం లెక్కచేయకుండా భారీ షాట్లు ఆడాడు. ఆఖరి ఓవర్లలో హోప్‌కు స్ట్రైకింగ్ తక్కువే లభించినా.. అవకాశం వచ్చినపుడల్లా అతను షాట్లు ఆడాడు. అతను శతకం పూర్తి చేసిన తీరు మ్యాచ్‌కే హైలైట్. 2 బంతులు మిగిలుండగా 90 పరుగులపై నిలిచిన హోప్.. చివరి రెండు బంతులకు (బౌలర్ నితీశ్) మిడాన్, లాంగాన్‌లో కళ్లు చెదిరే సిక్సర్లతో మూడంకెల స్కోరును అందుకున్నాడు.








# ఉప్పల్‌లో పడ్డారు

**పొట్టి క్రికెట్లో వెస్టిండీస్‌తో అంత తేలిక కాదని మరోసారి రుజువైంది. భారత్‌కు వన్డే సిరీస్ కోల్పోయాక.. టీ20 సిరీస్‌లో గట్టి పోటీనిస్తున్న కరీబియన్ జట్టు, సిరీస్‌ను 2-2తో సమం చేసి ఫలితాన్ని చివరి పోరుకు మళ్లించింది. భారత బౌలర్లపై పగబట్టినట్లుగా చెలరేగిపోతున్న విండీస్ కెప్టెన్ షై హోప్.. ఈ పర్యటనలో నాలుగో శతకం బాదేశాడు. మిగతా బ్యాటర్లూ ధాటిగా ఆడడంతో ఉప్పల్ స్టేడియంలో టీమ్‌ఇండియాకు 248 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన వెస్టిండీస్.. బంతితోనూ రాణించి విజయాన్నందుకుంది. విధ్వంసక అర్ధశతకంతో సంజు శాంసన్ బలమైన పునాది వేసినా.. తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ, నితీశ్‌కుమార్ రెడ్డి కూడా పోరాడినా భారత్‌కు ఓటమి తప్పలేదు. ఇక సిరీస్ ఫలితం తేలేది చిన్నస్వామి స్టేడియంలోనే.**

**అదే దూకుడు..**

టీమ్‌ఇండియాతో సిరీస్ ఆరంభానికి ముందు వెస్టిండీస్ కెప్టెన్ ఎవరు అంటే భారత అభిమానుల్లో చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. కానీ ఈ పర్యటన ముగిసేసరికి తన పేరును ఎప్పటికీ గుర్తుంచుకునేలా చేశాడు షై హోప్. 12, 104, 162 నాటౌట్, 52, 102 నాటౌట్, 5, 102 నాటౌట్.. పర్యటనలో వెస్టిండీస్ పరిమిత ఓవర్ల క్రికెట్ కెప్టెన్ హోప్ గణాంకాలు ఇవి. విండీస్ జట్టులో హోప్ కీలక బ్యాటరే కానీ.. అతను అంతర్జాతీయ క్రికెట్లో ఈ స్థాయిలో ఎప్పుడూ రెచ్చిపోయింది లేదు. టీ20ల్లో హోప్ మూడు శతకాలు సాధిస్తే.. అందులో రెండు ప్రస్తుత సిరీస్‌లో సాధించినవే. మూడు వన్డేల సిరీస్‌లో రెండు శతకాలు సాధించిన అతను.. టీ20 సిరీస్‌లో కూడా రెండోసారి మూడంకెల స్కోరును చేరుకున్నాడు. ఈ పర్యటనలో రెండు అద్భుత ఛేదనల్లో హోప్ చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడాడు. చివరి వన్డేలో 50 ఓవర్ల పాటు వికెట్ కీపింగ్ చేసి.. బ్యాటింగ్‌లో 49వ ఓవర్ వరకు క్రీజులో నిలిచి 162 పరుగుల మారథాన్ ఇన్నింగ్స్‌తో 352 పరుగుల భారీ ఛేదనలో విండీస్‌ను గెలిపించిన తీరు అసామాన్యం. ఇక రెండో టీ20లో 250 పరుగుల లక్ష్యాన్ని నిలిపినా భారత్ ఓటమి పాలైందంటే హోప్ సంచలన ఇన్నింగ్స్ (102 నాటౌట్)యే కారణం. భీకర ఫామ్‌ను కొనసాగిస్తూ ఇప్పుడు ఉప్పల్‌లోనూ సూపర్ సెంచరీ సాధించాడు.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: హోప్ నాటౌట్ 102; ఆండ్రూ ఎల్బీ (బి) అక్షర్ 21; హెట్‌మయర్ (సి) అండ్ (బి) ప్రిన్స్ 33; రోమన్ పావెల్ (సి) శాంసన్ (బి) అర్ష్‌దీప్ 24; రూథర్‌ఫర్డ్ నాటౌట్ 49; ఎక్స్‌ట్రాలు 18 మొత్తం: (20 ఓవర్లలో 3 వికెట్లకు) 247; వికెట్ల పతనం: 152, 2110, 3156; బౌలింగ్: మయాంక్ యాదవ్ 40520; అర్ష్‌దీప్ సింగ్ 40521, ప్రిన్స్ యాదవ్ 40361; అక్షర్ పటేల్ 40451; నమన్ ధీర్ 10190; నితీశ్‌కుమార్ రెడ్డి 30390

భారత్ ఇన్నింగ్స్: సంజు (సి) హెట్‌మయర్ (బి) పాల్ 56; అభిషేక్ (సి) స్ప్రింగర్ (బి) మోటీ 29; ఇషాన్ (సి) ఆండ్రూ (బి) పాల్ 6; శ్రేయస్ (సి) ఆండ్రూ (బి) స్ప్రింగర్ 16; తిలక్ (సి) పావెల్ (బి) షెఫర్డ్ 43; నమన్ ధీర్ (స్టంప్డ్) హోప్ (బి) మోటీ 0; నితీశ్ (సి) పావెల్ (బి) పాల్ 41; అక్షర్ (సి) రూథర్‌ఫర్డ్ (బి) పాల్ 3; ప్రిన్స్ (బి) పాల్ 0; అర్ష్‌దీప్ రిటైర్డ్ హర్ట్ 5; మయాంక్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 24 మొత్తం: (19.3 ఓవర్లలో ఆలౌట్) 223; వికెట్ల పతనం: 160, 267, 397, 4130, 5130, 6200, 7212, 8212, 9213; బౌలింగ్: ఛేజ్ 40430; షమార్ జోసెఫ్ 2.30470; రొమారియో షెఫర్డ్ 30321, కీమో పాల్ 40415; షమార్ స్ప్రింగర్ 40401; గుడాకేశ్ మోటీ 20132

---



# యోధాస్ గెలుపు

**హైదరాబాద్: ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో పృథ్వీరాజ్ యోధాస్ పుంజుకుంది. బుధవారం ఆ జట్టు 5-1తో చేరో ఆర్చర్స్‌పై ఘనవిజయాన్నందుకుంది. గణేశ్ మణిరత్నం 60కి 59 పాయింట్లతో జట్టు గెలుపులో కీలకమయ్యాడు. తొలి సెట్‌ను రెండు జట్లు పంచుకోగా.. 77-75, 77-74తో తర్వాతి రెండు సెట్లను గెలిచిన యోధాస్ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. జ్యోతి సురేఖ ఆడుతున్న కాకతీయ నైట్స్ హ్యాట్రిక్ విజయం సాధించింది. ఆ జట్టు 6-2 (74-73, 79-78, 74-75, 76-74)తో రాజ్‌పుతానా రాయల్స్‌పై గెలిచింది. జ్యోతి 80కి 78 పాయింట్లతో జట్టును ముందుండి నడిపించింది. ధీరజ్ బొమ్మదేవర ప్రాతినిధ్యం వహిస్తున్న మైటీ మరాఠాస్ వరుసగా అయిదో విజయం ఖాతాలో వేసుకుంది. మరాఠాస్ 6-0 (77-76, 75-72, 78-75)తో చోళా చీఫ్స్‌ను చిత్తు చేసింది. నైట్స్, మరాఠాస్ చెరో 10 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. యోధాస్ (8), చేరో ఆర్చర్స్ (6), రాయల్స్ (6), చీఫ్స్(2) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.**

---



# బెంగాల్ బోణీ

### ఢిల్లీపై 9 వికెట్ల తేడాతో గెలుపు
### బోనస్ పాయింట్‌లతో నెగ్గిన బరోడా, గుజరాత్

కోల్‌కతా: దేశవాళీ ప్రతిష్ఠాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ 2026-27 సీజన్ తొలి మ్యాచ్‌లో బెంగాల్ ఘనవిజయం సాధించింది. ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా బుధవారం ముగిసిన పోరులో బెంగాల్ 9 వికెట్ల తేడాతో ఢిల్లీపై గెలిచింది. దీంతో బెంగాల్ జట్టు ఖాతాలో ఆరు పాయింట్లు చేరాయి. ఓవర్‌నైట్ స్కోరు 101/3తో బుధవారం చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 106.2 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. ఆయుశ్ బదోనీ (85; 10 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. అతడికి అనూజ్ రావత్ (39; 7 ఫోర్లు) కాస్త సహకరించాడు.బెంగాల్ బౌలర్లలో ప్రదీప్త ప్రమాణిక్ 3 వికెట్లు పడగొట్టగా... సుమంత గుప్తా, అమీర్ గనీ 2 వికెట్ల చొప్పున తీశారు. సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ 18 ఓవర్లలో 29 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీశాడు.

అనంతరం 89 పరుగుల లక్ష్యఛేదనకు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్... 15.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 89 పరుగులు చేసింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (34 నాటౌట్; 3 ఫోర్లు), అంకుర్ పాల్ (38; 2 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నారు. అంతకుముందు ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 240 పరుగులు చేయగా... బెంగాల్ 429 పరుగులు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ చేసిన బెంగాల్ బ్యాటర్ అభిషేక్ పోరెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో భాగంగా ఆదివారం నుంచి ప్రారంభం కానున్న తదుపరి మ్యాచ్‌లో సర్వీసెస్‌తో బెంగాల్ తలపడనుంది.

**గోవాపై బరోడా 'బోనస్' గెలుపు**

ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా పనాజీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో గోవాపై బరోడా జట్టు ఘనవిజయం సాధించింది. ఇన్నింగ్స్ 135 పరుగుల తేడాతో గోవాను చిత్తుచేసిన బరోడా 'బోనస్' పాయింట్‌తో కలిపి 7 పాయింట్లను తమ ఖాతాలో వేసుకుంది. బరోడా 472/8 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... గోవా తొలి ఇన్నింగ్స్‌లో 199 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 35/1తో చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన గోవా... చివరకు 68 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. శివేంద్ర భుజ్‌బల్ (154 బంతుల్లో 46; 4 ఫోర్లు), కెప్టెన్ అభినవ్ తేజ్‌రాణా (100 బంతుల్లో 47; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా ఫలితం లేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మహేశ్ పీతియా... రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీశాడు. భార్గవ్ భట్‌కు 5 వికెట్లు దక్కాయి.

**విదర్భ 160 పరుగులతో విజయం**

ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా నాగ్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో పుదుచ్చేరిపై విదర్భ 160 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 22/1తో బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ... 36 ఓవర్లలో 175/3 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అమన్ మోఖడే (65; 4 ఫోర్లు), ధ్రువ్ షోరే (69 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. దీంతో 291 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పుదుచ్చేరి జట్టు 41.1 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌటైంది.

ప్రసాద్ పవార్ (48; 6 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలినవాళ్లంతా విఫలమయ్యారు. హర్ష్ దూబె 4, పార్థ్ రేఖడే మూడు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 428 పరుగులు చేయగా... పుదుచ్చేరి 313 పరుగులు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేసిన విదర్భ సారథి అక్షయ్ వాడ్కర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో భాగంగా ఆదివారం నుంచి జరగనున్న తదుపరి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జమ్మూకశ్మీర్‌తో విదర్భ ఆడుతుంది.

**సిద్ధార్థ్ 'పాంచ్' పటాకా...**

అహ్మదాబాద్ వేదికగా ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా ఒడిశాతో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 10 వికెట్ల తేడాతో గెలిచి బోనస్ పాయింట్‌తో కలిపి 7 పాయింట్లను తమ ఖాతాలో వేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 119/4తో చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఒడిశా చివరకు 46.1 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. సందీప్ పట్నాయక్ (65; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), నినాద్ రాథ్వా (53; 10 ఫోర్లు) అర్ధశతకాలు సాధించారు.

గుజరాత్ బౌలర్లలో సిద్ధార్థ్ దేశాయ్ 5 వికెట్లు పడగొట్టగా... అర్జాన్ నాగ్‌వస్వల్లా 3 వికెట్లు తీశాడు. అనంతరం 47 పరుగుల లక్ష్యఛేదనకు బరిలోకి దిగిన గుజరాత్ జట్టు 9.3 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. ఆర్య దేశాయ్ (37 నాటౌట్; 7 ఫోర్లు) వేగంగా ఆడాడు. అంతకుముందు ఒడిశా తొలి ఇన్నింగ్స్‌లో 324 పరుగులు చేయగా... గుజరాత్ 439 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన గుజరాత్ ప్లేయర్ వేదాంత్ త్రివేదికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

**విక్కీ మాయాజాలం...**

ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా ఢిల్లీ వేదికగా సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లోమహారాష్ట్ర జట్టు 127 పరుగుల తేడాతో గెలుపొందింది. ఓవర్‌నైట్ స్కోరు 66/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మహారాష్ట్ర చివరకు 56 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. అంకిత్ బావ్నే (48; 3 ఫోర్లు), రాజ్‌వర్ధన్ హంగార్గేకర్ (43; 5 సిక్స్‌లు)రాణించారు. సర్వీసెస్ బౌలర్లలో అర్జున్ శర్మ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 248 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సర్వీసెస్ 63.3 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. నకుల్ శర్మ (36) టాప్ స్కోరర్. మహారాష్ట్ర స్పిన్నర్ విక్కీ ఓస్త్‌వాల్ 5 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అంతకుముందు మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 333 పరుగులు చేయగా... సర్వీసెస్ 227 పరుగులు చేసింది. మహారాష్ట్ర ప్లేయర్ అంకిత్ బావ్నేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



**లాంఛనం ముగిసింది!**

మూడో రోజే విజయానికి చేరువైనప్పటికీ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయి కాస్త ఇబ్బందిపడ్డ హరియాణా జట్టు... చివరి రోజు తొలి గంటలోపే పనిపూర్తి చేసింది. ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా రోహతక్‌లో హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో హరియాణా 7 వికెట్ల తేడాతో గెలిచింది.71 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 26/3తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హరియాణా 18.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసింది.

హిమాన్షు రాణా (37; 5 ఫోర్లు) వేగంగా ఆడాడు. అంతకుముందు హిమాచల్ తొలి ఇన్నింగ్స్‌లో 253 పరుగులు చేయగా... హరియాణా 296 పరుగులు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే పరిమితమైన హిమాచల్ ప్రదేశ్... ప్రత్యర్థి ముందు స్వల్ప లక్ష్యాన్ని ఉంచింది. హరియాణా ఆల్‌రౌండర్ కనిష్క్ చౌహాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

**ప్లేట్ గ్రూప్‌లో మణిపూర్ శుభారంభం**

ప్లేట్ గ్రూప్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో మిజోరంపై మణిపూర్ 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. మిజోరం తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగులు చేయగా... మణిపూర్ 251 రన్స్ కొట్టింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మిజోరం 295 పరుగులు చేయగా... 228 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 8/0తో బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మణిపూర్ 71.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 228 పరుగులు చేసి గెలిచింది. జతిన్ (105 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ శతకంతో ఆకట్టుకున్నాడు. ఇదే గ్రూప్‌లో భాగంగా సిక్కిం, మేఘాలయ మధ్య జరిగిన మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.

ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా జంషడ్‌పూర్ వేదికగా జార్ఖండ్, కేరళ మధ్య జరిగిన మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన జార్ఖండ్‌కు మూడు పాయింట్లు, కేరళకు ఒక పాయింట్ దక్కాయి. ✴ ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా మధ్యప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌ను డిఫెండింగ్ చాంపియన్ జమ్మూకశ్మీర్ జట్టు 'డ్రా' చేసుకుంది. 326 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జమ్మూకశ్మీర్... ఆట ముగిసే సమయానికి 88/7తో నిలిచింది. ✴ చండీగఢ్ వేదికగా ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా అస్సాం, పంజాబ్ మధ్య జరిగిన మ్యాచ్ 'డ్రా' అయింది. ఇదే గ్రూప్‌లో సౌరాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మధ్య పోరు కూడా సమంగా ముగిసింది. సౌరాష్ట్ర బ్యాటర్ చిరాగ్ జానీ రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చెశాడు. ✴ ఎలైట్ గ్రూప్ 'డి'లో రైల్వేస్, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌తో పాటు రాజస్తాన్, తమిళనాడు పోరు 'డ్రా'గా ముగిశాయి.